శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# పేదల నివాసాలు కూల్చడం దుర్మార్గం

## బిజేపీ కార్యాలయం కూల్చినవారిని వదిలే ప్రసక్తే లేదు





**నెల్లూరు డిసెంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్రంలో తుఫాను భీభత్సం సృష్టిస్తున్నప్పటికీ ఆ ప్రభావానికి గురైన పేద ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా పేదల గుడిసెలను కూల్చిందంటూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లవల్లి. భరత్ కుమార్ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక మైపాడుగేటు ప్రశాంతి నగర్‌లో ఉన్న పేదల ఇళ్ళతోపాటు, బిజేపీ కార్యాలయాన్ని ఆక్రమణల పేరుతో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న భరత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డిలు, తమ పార్టీ కార్యకర్తలతో అక్కడకి చేరుకుని, అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ తుఫాన్‌లో సైతం వైసీపీ కక్ష సాధింపులకు పాల్పడుతూ కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పేదల ఇళ్ళతోపాటు తమపార్టీ కార్యాలయాన్ని కూల్చివేయడం దుర్మార్గమన్నారు. వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపుకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. వైకాపా చేపడుతున్న కార్యకలాపాలకు ఇది పరాకాష్టన్నారు. తమపార్టీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ ఫోటోలతోపాటు విలువైన వస్తు సామాగ్రి ఉందని తెలిపారు. ఈ మొత్తాన్ని కూడా ధ్వంసం చేశారని, దీని వెనుక మున్సిపల్ కార్పొరేషన్ డిఈ కుట్ర దాగి ఉందని భరత్ వివరించారు. తమ పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేసినందుకు కలెక్టర్‌తోపాటు, మున్సిపల్ కమిషనర్ కూడా సమాధానం చెప్పి తీరాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వయస్సు రీత్యా చిన్నదని, ఇలాంటి కార్యకలాపాలను ప్రోత్సాహించడం మంచిది కాదన్నారు. పార్టీలు వస్తూంటాయి, పోతూంటాయని అధికారం ఎవరకీ శాశ్వతం కాదన్నారు. తాము అన్నీ గుర్తు పెట్టుకుంటామని, బిజేపీ ఎవరినీ వదిలి పేట్టే ప్రసక్తే లేదన్నారు. డిఈ, ఇతర అధికారుల సంగతి తేల్చుతామని ఆయన హెచ్చరించారు.

## సంగం ఆనకట్టను పరిశీలించిన సిఐ రవినాయక్



**సంగం డిసెంబర్ 10 ప్రభాతవార్త** సంగం ఆనకట్టపైన ఇరిగేషన్ అధికారులు గేట్లు మూసివేశారు. సంగం ఆనకట్టను సిఐ రవినాయక్ పరిశీలించారు. వరద పరిస్థితి గురించి ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రజలు ప్రయాణాలు పెట్టుకోవద్దని సిఐ సూచించారు. మండలంలోని నది పరివాహా ప్రాంతాల ప్రజలు ఎట్టి పరిస్థితులలో పశువుల్ని తీసుకొని నదిలోకి దిగరాదని సూచించారు. సోమశిల నుండి నీరు విడుదల చేస్తున్న తరుణంలో నది పరివాహా ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## పొంగిపొర్లిన కండలేరు

**మనుబోలు, డిసెంబరు 10 ప్రభాతవార్త** మాండూస్ తుఫాన్‌తో మనుబోలు మండలానికి గండం తప్పింది. కండలేరు కాజ్‌వేపైన ఉధృతంగా నీరు ప్రవహించింది. శుక్రవారం ఏకదాటిగా కురిసిన వర్షంతో మొదటి సారిగా ఈ ఏడాది కండలేరు కాలువ పొంగిపొర్లడం విశేషం. అలాగే అరకొరగా వున్న చెరువులు పూర్తిగా నిండిపోయాయి. దీంతో రబీ వ్యవసాయానికి పుష్కలంగా నీరు లభించింది. ఈ వర్షాలతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. పరిస్థితి అదుపులో వుందని అధికారులు తెలిపారు.

## కాగితాలపూరు రోడ్డుకు గండి...రాకపోకలకు అంతరాయం

**మనుబోలు, డిసెంబరు 10 ప్రభాతవార్త** మనుబోలు మండలంలోని కాగితాలపూర్ రోడ్డుకు వెళ్లే రోడ్డు మధ్యలో గండిపడింది. ఫలితంగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మాండూస్ తుఫాన్‌తో కురుస్తున్న భారీ వర్షాలకు కాగితాలపూరు రోడ్డు మధ్యలో వేసిన కల్వర్ట్ రోడ్డు కోసుకుపోయి గండిపడింది. పెద్దపెద్ద తుఫాన్లు, భారీ వర్షాలకు సైతం కాగితాలపూరు రోడ్డు ఎప్పుడు తెగిన సందర్భాలు లేవు. మొగల్లచెరువుకు నీరు మళ్లించే కల్వర్టు కోసుకుపోవడంతో శుక్రవారం రాత్రి కల్వర్టు కోసుకుపోయింది. కాగితాలపూరు సర్పంచ్ చెముడుగుంట ఏడుకొండలు జెసిబి సహాయంతో శనివారం మధ్యాహ్నం నుండి మరమ్మతులు చేయించే ప్రయత్నం చేసినప్పటికీ బురద వల్ల కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు ఈ మార్గంలో వెళ్లే పరిస్థితి కనిపించలేదు. మోటార్‌సైకిళ్లు, ఆటోలు ఇక్కడ ఇరుక్కుపోతున్నాయి. కంకర మట్టితో ఆదివారం పూర్తిగా మరమ్మతులు చేసి రోడ్డు సిద్ధం చేస్తామని సర్పంచ్ ఏడుకొండలు తెలిపారు.

## ఆత్మకూరు అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం

### - ఎడిఎఫ్‌కు మేకపాటి ఫౌండేషన్ ద్వారా 10కోట్లు ప్రకటించిన ఎమ్మెల్యే




**ఆత్మకూరు, డిసెంబర్10ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు అందరూ భాగస్వామ్యులు కావాలని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్‌ఫోరం అంకురార్పణ సభలోఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో నిలిపేందుకు వివిధరంగాలకు చెందిన ప్రతినిధులు, ఉన్నతస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరంను ఏర్పాటు చేశామన్నారు. ఎంజిఆర్ ఫౌండేషన్ ద్వారా ఎడిఎఫ్‌కు 10కోట్ల రూపాయలను కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే ప్రకటించారు. దీని ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా విద్య, ఉపాధి అవకాశాలే కాక రైతులకు , విద్యావంతులకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరి సహాయం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి జాతీయ రహదారుల అనుసంధానం ఉన్న క్రమంలో పారిశ్రామికంగా అభివృద్ధిని సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి అభివృద్ధికోసం కోరామన్నారు. నియోజకవర్గం హైదరాబాదు, చెన్నై , బెంగుళూరు వెళ్ళే జాతీయ రహదారుల ఏర్పాటు ద్వారా లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేసుకోవడం గాక 500లకు పైగా చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటు ద్వారా నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయవచ్చని విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. తమ సోదరుడు దివంగతమంత్రి మేకపాటి గౌతంరెడ్డి పేరున ఇప్పటికే నియోజకవర్గ కేంద్రంలో బస్టాండు నిర్మాణాన్ని ప్రారంభించామని , నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం ఎడిఎఫ్‌కు తమ ఫౌండేషన్ ద్వారా 10కోట్లు కేటాయించామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి సాధించేలా అందరి సహకారంతో ముందుకు వెళతామన్నారు. ఈసందర్భంగా ఎడిఎఫ్ కార్యక్రమాలకు హాజరైన ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మెమొంటోలను అందజేశారు.

## గీతా మందిరంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ

**కావలి, డిసెంబరు 10 ప్రభాతవార్త** కావలి పట్టణ రైల్వే రోడ్డులో వున్న గీతా మందిరం జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గీతా మందిర నిర్వహణ కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ నెల 12వ తేది నుంచి 15వ తేది వరకు నాలుగు రోజుల పాటు అంకురార్పణ సహిత త్రయాహ్నిక దీక్షతో తిరుమల తిరుపతి దేవస్థాన వైఖానస ఆగమ విద్యాంసులచే వైఖాన సాగమోక్తంగా విశేష కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. తిరుపతి శ్రీనివాస మంగాపురం శ్రీ వశిష్టాశ్రమ శ్రీ లలితా పీఠ వ్యవస్థాపక పీఠాధిపతులు స్వస్వరూపనంద గిరి స్వాముల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీకృష్ణుని కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరంకు అంకురార్పణ



**ఆత్మకూరు, డిసెంబర్10ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సారధ్యంలో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరంకు అంకురార్పణ జరిగింది. శనివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్‌గార్డెన్స్ వేదికగా ఉన్నతస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు , వివిధ విభాగాల్లోని ఉన్నతస్థాయి వ్యక్తులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రక్షణశాఖామంత్రి , సాంకేతిక సలహాదారుడు గుండ్రా సతీష్‌రెడ్డి , సీడ్స్ సంస్థ వ్యవస్థాపకులు , ఎంజిఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆర్.చంద్రమౌళేశ్వరిరెడ్డి, నుడా వైస్‌చైర్మెన్ టి.బాపిరెడ్డి, ఆత్మకూరు ఆర్‌డిఒ ఎస్.కరుణకుమారి , ప్రజా ప్రతినిధులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ఈకార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈసందర్భంగాఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరంకు లోగోను గుండ్రా సతీష్‌రెడ్డి ప్రారంభించారు. ఆత్మకూరు నియోజకవర్గంప్రధానంగా అభివృద్ధి సాధించేందుకు భవిష్యత్తు తరాల వారికోసం అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు, విద్య, ఉపాది అవకాశాలు , సాంకేతిక నైపుణ్యం , వ్యవసాయం , పారిశ్రామికంగా ఆత్మకూరును సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌళిక సదుపాయాల ఏర్పాటుకోసం ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరంకు అంకురార్పణ చేశామన్నారు.

వివిధ విభాగాలకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు పలు రంగాల్లో ఉన్న మేధావులు , ప్రజా ప్రతినిధులతో చర్చలు నిర్వహించారు. అనంతరం రక్షణశాఖామంత్రి, సాంకేతిక సలహాదారుడు గుండ్రా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధికోసం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా నియోజకవర్గం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నందున ఆదిశగా అందరం సమిష్టిగా కృషి చేయాలని, దానికి అందరి సహకారం ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టిసారించాలని సతీష్‌రెడ్డి కోరారు. వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకున్న రైతులకు అవసరమైన అభివృద్ధి పనులతోపాటు విద్య, ఉపాదిరంగాలపై దృష్టిసారించాలని ఆయన సూచించారు. పారిశ్రామికంగా ఆత్మకూరు నియోజకవర్గానికి ప్రాధాన్యత కల్పించే విధంగా చూడాలని , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారాలతో ఎడిఎఫ్‌ను మరింత ముందుకు తీసుకెళతామని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. సీడ్స్ సంస్థ వ్యవస్థాపకులు, ఎంజిఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆర్.చంద్రమౌళీశ్వరిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో విద్యాప్రమాణాలు రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న క్రమంలో మన ప్రాంత విద్యార్థులకు సైతంసాంకేతిక విద్యను అందించడం ద్వారా వారు మరింత అభివృద్ధిలోకి వస్తారన్నారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. ఫర్చువల్ ద్వారా ఈకార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ప్రభుత్వ, ప్రవేటు సంస్థలు ధాతృత్వ వేత్తలు, స్థానిక ప్రజాసంఘ నాయకుల సమిష్టి సహకారంతో వెనుకబడిన ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎడిఎఫ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాతలు, స్వచ్చందసంస్థలు ముందుకు వచ్చి ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. అభివృద్ధి పరంగా ఆత్మకూరు నియోజకవర్గాన్ని ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా చూడాలని కలెక్టర్ కోరారు. ఈకార్యక్రమంలో నుడా వైస్ చైర్మెన్ టి.బాపిరెడ్డి, మున్సిపల్‌కమీషనర్ రమేష్‌బాబు, నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.




# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్లు పర్యటించాలి



**నెల్లూరు అర్బన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** మాండూస్ తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలపై శనివారం ఉదయం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫిరెన్స్ ద్వారా పరిస్థితులను సమీక్షించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ఆయా జిల్లాల కలెక్టర్లు శనివారం, ఆదివారం ంరెండు రోజులు గ్రామాల్లో పర్యటించాలని సీఎస్ ఆదేశించారు. వర్షపునీరు తొలగిన తరువాత నష్టం అంచనాకు ఎన్యుమరేషన్ ప్రక్రియను చేపట్టాలని సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. తిరుపతి పట్టణంలో వర్షపునీరు త్వరితగతిన దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి కలెక్టర్‌ను ఆయన ఆదేశించారు. ఈ టెలి కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న సీఎంవో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ భారీ వర్షాలు పడిన ప్రాంతాల్లో వెంటనే శానిటేషన్ పనులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షపునీరు తగ్గిన వెంటనే పంట నష్టం అంచనాలను చేపట్టాలని చెప్పారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ తుఫాను పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో నిరంతరం మానిటర్ చేస్తూ ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సంచాలకులు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ శుక్రవారం రాత్రి 8:30 గంటల నుంచి శనివారం ఉదయం 8:30 గంటల వరకు అన్నమయ్య జిల్లాలో 23.3 మిల్లీ మీటర్లు, చిత్తూరు జిల్లాలో 30.5, ప్రకాశం జిల్లాలో 14.1, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 57.6, తిరుపతి జిల్లాలో 75.7, వైఎస్ఆర్ కడప జిల్లాలో 14.5 మిల్లీ మీటర్ల వంతున సరాసరి వర్షపాతం నమోదైందని సీఎస్‌కు వివరించారు. కాగా గత 24 గంటల్లో పై తెలిపిన ఆరు జిల్లాల్లోని 109 ప్రాంతాల్లో 64.5 మిల్లీ మీటర్ల కంటే అధిక వర్షపాతం నమోదైనట్లు డాక్టర్ అంబేద్కర్ చెప్పారు. ఈ టెలికాన్ఫిరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు పాల్గొని, జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న చర్యలను వివరించారు.

# వరద ప్రభావ ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** మాండూస్ తుఫాను నేపథ్యంలో నగరవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రభావానికి గురైన వివిధ ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలను చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. భారీ వర్షాలకు వరద ప్రభావానికి గురైన లోతట్టు ప్రాంతాలైన స్థానిక సుందరయ్యకాలనీ, నక్కలగుంట, టెక్కేమిట్ట, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరదనీటి ప్రవాహనం జనావాసాల్లో ఆగిపోకుండా ఎప్పటికప్పుడు డ్రైను కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని ఆదేశించారు. ప్రజల రవాణా సౌకర్యానికి అంతరాయంగా ప్రధాన మార్గాల్లో కూలిన భారీ వృక్షాలను వెంటనే తొలగించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. నగరవ్యాప్తంగా ప్రధాన మార్గాలు, అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తోడివేయాలని కమిషనర్ ఆదేశించారు. వరద ప్రభావానికి గురయ్యే అన్ని డివిజనుల్లో ప్రజా జీవనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు.

# అకాల వర్షం.. ఇబ్బందుల్లో రైతాంగం



**కోవూరు,డిసెంబరు 10 ప్రభాతవార్త :** అల్పపీడన ద్రోణి మాండూస్ కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. మురికి కాలువల సైతం ఈ అకాల వర్షం కారణంగా పొంగి ప్రవహించాయి. పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లపై సైతం వర్షపు నీటితో కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. ఇటీవల నాట్లు వేసిన, నార్లు పోసిన రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు ఘననీయంగా పెరిగి ఆశించిన మేర గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న అన్నదాతలకు గోరుచుట్టుపై రోకలిపోటులా ఈ తుఫాను తీవ్ర ఇబ్బందిని కలిగించింది. గతంలో వచ్చిన తుపానుకే రైతాంగం తేరుకోకముందే మరలా ఈ తుపాను కారణంగా నాట్లు, నార్లు నీటితో మునిగిపోయాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న ఈ అకాల వర్షాలకు కూలీలకు ఆశించిన మేర పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మొత్తం మీద వరుసగా కురిసిన ఈ రెండు తుపానులు ఇటు ప్రజల్లోనూ అటు రైతుల్లోనూ తీవ్ర ఆందోళన కలిగించింది.



## నీట మునిగిన పంటపొలాలు, విద్యుత్ స్తంభాలు

**కొడవలూరు డిసెంబర్ 10 ప్రభాతవార్త:** మాండూస్ తూఫాన్ ప్రభావంతో కొడవలూరు మండలంలోని పలు ప్రాంతాలు వరద నీటితో జలమయం కావడం వలన పంట పోలాలు, వరి నారుమడులు నీట మునగటంతో రైతుల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తూఫాన్ ప్రభావం వలన యల్లాయపాలెం గ్రామం నందు ఒక ట్రాన్‌ఫరం కాలిపోవడం, రెండు విద్యూత్ స్తంభాలు పడిపోవడం జరిగిందని, దానికి ప్రత్యామ్నయగా విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించామని మండల విధూత్ సహాయక ఇంజనీర్ మోగిలి రాములు తెలిపారు.



## గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గం ఎంపిక



**బిట్రగుంట, డిసెంబరు 10 ప్రభాతవార్త** బోగోలు మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గానికి శనివారం ఎన్నికలు జరిగాయి. సంఘం అధ్యక్షులుగా అలహరి పార్ధసారధి, ఉపాధ్యక్షుడుగా నక్కా బాలనరసింహం, కార్యదర్శిగా పి.వి.ఎన్.సతీష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ప్రళయకావేరి గిరిబాబు,కోశాధికారిగా రావూరి దొరసానిలు ఎన్నికయ్యారు.అనంతరం నూతన కార్యవర్గం తహశీల్దార్ లక్ష్మీనారాయణను కలిసి నూతన కార్యవర్గ జాబితాను అందజేశారు. నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు.

## సింహాద్రిరావుకు హ్యూమన్ రైట్స్ పురస్కారం




**బిట్రగుంట, డిసెంబరు 10 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ కె.సింహాద్రిరావుకు హ్యూమన్ రైట్స్ సమాజ సేవ పురస్కారాన్ని శనివారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నెల్లూరులో ఆసంస్థ చైర్మన్ యం.సుబ్బారెడ్డి అందజేశారు. నాలుగు దశాబ్దాల కాలంగా ఎయిడ్స్ రోగులకు, మానసిక రోగులకు చేసిన సేవలు గుర్తించి ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. సింహాద్రిరావు మాట్లాడుతూ తనను ఈ అ వార్డుకు ఎంపిక చేసినందుకు ప్రపంచ మానవ హక్కుల సంస్థ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. 1999 నుండి ఇప్పటి వరకు 276 అవార్డులు అందుకోవడంతో పాటు 2006లో రాష్ట్రపతి అవార్డు కూడా సింహాద్రావు పొందడం పట్ల ఆయనను పలువురు అభినందించారు.

## కలిగిరిలో కుండపోత వాన



కలిగిరి, డిశెంబర్10, ప్రభాతవార్త;కలిగిరి మండలంలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి.మాండూస్ తుపాన్ కారణంగా మండలంలో రెండు రోజులుగా వానలు పడుతున్నాయి. మాండూస్ తుఫాన్ తీరం దాటిందని వార్తలు వస్తున్న నేపద్యంలో శనివారం అతిభారీ వర్షాలు పడుతున్నాయి.రోజంతా ఎడతెలిపి లేకుండా వర్షాలు పడడంతో ప్రజలు ఇళ్లనుండి బయటకు రావడంలేదు.పంటపొలాలు సైతం మునిగి పోగా చెరువులకు బారీ స్థాయిలోవర్షపునీరు చేరుతుంది. ఇదే వుదృతి కొనసాగితే చెరువులకు ప్రమాదాలు జరగవచ్చని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. బారీ వర్షాలకు తోడుచలిగాలలు వీస్తుండడంతో ప్రజలు చలితో వణికి పోతున్నారు.

## వర్షాలకు సహాయక చర్యలు



**కలిగిరి, డిశెంబర్10, ప్రభాతవార్త;** గత రెండు రోజులుగా బారీ వర్షాలు కురుస్తుండడంతో అధికారులు సహాయక చర్యలు మొదలు పెట్టారు. వర్షాలకు లోతట్టుప్రాంతాలనుండి నీరు బయటకు పోకపోవడంతో శనివారం కలిగిరి పంచాయితీ, రెవిన్యూ శిబ్బంది సహాయక చర్యలు చెపట్టారు. నీరు అధికంగా నిలువ ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్న చోట్ల జెసిపి సహాయంతో నీటిని బయటకు పంపే చర్యలుచేపట్టారు. కలిగిరిలోని కొండాపురం రోడ్డు వెంబడి నీరు నిలిచి నివాసాలలోకి నీరు రావడంతో నీటిని తరలించే కార్యక్రమం చేపట్టారు. అదేవిదంగా వెంకనపాలెం యస్టీకాలనీలోకి నీరు చేరకుండా తగు చర్యలు చెపట్టారు.
ఈ కార్యక్రమంలో పంచాయితీ విబ్బంది, రెవిన్యూ శిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి




**కోవూరు,డిసెంబరు 10 ప్రభాతవార్త** : పెండింగ్ కేసుల పరిష్కారంపై సర్కిల్ పరిధిలోని ఎస్సైలు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో వాటిని పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. కోవూరులోని సర్కిల్ కార్యాలయంలో శనివారం సర్కిల్ పరిధిలోని కోవూరు, ఇందుకూరుపేట ఎస్సైలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులపై దష్టి పెట్టి వాటిని సకాలంలో కేసులు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా వివాహ సీజన్ కావడం వలన గ్రామాల్లో ఎవరైనా వేరే ఊర్లకు వెళ్తుంటే అటువంటి వారి సమాచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లోని మహిళా పోలీసులు కూడా ప్రజ.లకు పలు విషయాలపై అవగాహన కల్పించడమే కాకుండా కొత్త వ్యక్తులు ఎవరైనా తిరుగాడుతుంటే అటువంటి వారి సమాచారాన్ని స్టేషన్‌కు అందించేలా చూడాలన్నారు. రెండు స్టేషన్ల పరిధిలోని కేసులపై సమీక్షించారు. ఈ సమీక్షలో కోవూరు ఎస్సై డి. వెంకటేశ్వరరావు, ఇందుకూరుపేట ఎస్సై టి. వాసులు ఉన్నారు.

## ధన్వంతరి కేరళ ఆయుర్‌కేర్ ఉచిత వైద్య శిబిరం




**నెల్లూరు డిసెంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం** ధన్వంతరి కేరళ ఆయుర్ కేర్, కేరళ పంచకర్మ ఆసుపత్రి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కీళ్ళనొప్పులు, అలర్జీ, ఆస్థమా, దగ్గు, గ్యాస్ట్రిక్ట్రబుల్ పలు వ్యాధులు ఉన్న 150 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీచేశారు.ఈ శిభిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కండ్ల కలక అధికంగా ఉన్నందున అందరూ పొంగించిన పటిక పొడిని చిటికెడు 250ఎంఎల్, డిస్టిల్డ్ వాటర్‌లో కలిపి కండ్లలో వేసుకుంటే కండ్ల కలక నుంచి రక్షించుకోవచ్చని డాక్టర్ శ్రీవత్సవకుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవత్సవకుమార్, శ్రీకర్‌భరద్వాజ్, తిరుమలశెట్టి.చంద్ర, ఆంజనేయ దేవస్థాన చైర్మన్ సూరిశెట్టి.ఉమా తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి



కోవూరు,డిసెంబరు 10 ప్రభాతవార్త : పెన్నానది పరివాహక ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవూరు తహసీల్దార్ ఎం. పద్మజ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె పోతిరెడ్డిపాలెం, చంద్రశేఖరపురం , తదితర ప్రాంతాల్లోని ప్రజలతో ప్రత్యేకంగా చర్చించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒకవేళ వర్షం ఎక్కువైతే పునరావాస కేంద్రాలకు తరలించేలా అన్ని ఏర్పాట్లు చేయడం జరి గిందన్నారు. ఈ పరిశీలనలో ఆమె వెంట కోవూరు ఎస్సై వెంకటాద్రినాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## వాస్తు నెపంతో స్తంభం మార్పిడికి చర్యలు



**కోవూరు,డిసెంబరు 10 ప్రభాతవార్త :** కోవూరులోని సాయిబాబా మందిరం సమీపంలో 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వ స్థలంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ఉంది. అయితే ఇటీవల ఆ ప్రాంతానికి చెందిన ఎన్. రమా అనే మహిళ నూతన గృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే వాస్తు కారణంగా ఈశాన్య ప్రాంతంలో విద్యుత్ స్తంభం ఉండడంతో అది తమకు ఇబ్బందికరంగా మారిందనే ఉద్దేశంతో ఆ స్తంభాన్ని తీసివేయాలని ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారంలోగా ఈ స్తంభాన్ని తీయకపోతే సంబంధిత అధికారులపై లోకాయుక్తలో కూడా కేసు వేస్తామని చెప్పడం గమనార్హం. ట్రాన్స్‌కో అధికారులను సైతం ఆమె బెదిరించి మార్పు చేయకపోతే నేను చేసేది చేస్తానని చెప్పడం గమనార్హం. వాస్తవంగా ఈ స్తంభం కూడా ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. అయినా కూడా ఈ ప్రాంతవాసులకు అది ఎప్పుడు కూడా ఇబ్బంది కలిగించలేదు. కేవలం నూతన గృహ నిర్మాణానికి గానూ వాస్తు దోషంతో ఈ స్తంబాన్ని మార్చాలని ట్రాన్స్‌కో శాఖకు లేఖ రాయడం విశేషం. ఈ విషయమై ట్రాన్స్‌కో డీఈ సతీష్‌బాబును వివరిణ కోరగా.. దీనిపై పరిష్కరించడం జరిగిందని, ఈ స్థలం పంచాయతీదేనని, ఇంకా తమకు సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు. ఈ స్తంభం ఏర్పాటు చేసి ఎన్నో సంవత్సరాలు అయిందని డీఈ పేర్కొన్నారు.

## మానవ హక్కులపై అవగాహన అవసరం




**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** మానవ హక్కులపై ప్రజలకు అవగాహన అవసరమని ఐహెచ్‌ఆర్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం శనివారం నెల్లూరు సుబేదర్‌పేటలోని ఐహెచ్‌ఆర్‌ఓ (ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్) కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1950వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి ఏటా డిసెంబరు 10వ తేదిన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించుకోవాలని డిక్లరేషన్ ఇచ్చిందని తెలిపారు. సమాజంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించే హక్కు కలిగి ఉన్నాడని చెప్పారు. సమానత్వం, సౌభ్రాతత్వం అనే నినాదంతో స్వేచ్ఛగా బతకాలనే ఉద్ధేశంతో మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజేషన్ అధ్యక్షులు వివరించారు. వ్యక్తిగత స్వేచ్ఛను హరించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే బాధితులు తమ సంస్థను ఆశ్రయించవచ్చని కోరారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులను తెలుసుకుని ప్రజలంతా స్వతంత్రంగా ప్రశాంతంగా జీవించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐహెచ్‌ఆర్‌వోలో సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌వో జిల్లా అధ్యక్షుడు షేక్ షఫీ అహ్మద్, ఐహెచ్‌ఆర్‌వో ఎడ్యుకేషన్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ మొబీన్, జిల్లా కార్యదర్శి నసీర్ అహ్మద్, ట్రెజరర్ శేఖర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జబీన్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## గీతామయి వృద్ధుల ఆశ్రమంలో మానవ హక్కుల దినోత్సవం



**నెల్లూరు టౌన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** బైబిల్ తరువాత ఐక్యరాజ్య సమితి మానవహక్కుల ప్రకటన ఎక్కువ బాషలలోకి అనువాదం అయ్యిందని ప్రముఖ సినీ దర్శకుడు మహేష్‌చంద్ పేర్కొన్నారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమం నందు మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల రక్షణ కోసం ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల రక్షణ కోసం ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్‌ను 1993లో ఏర్పరచారని వివరించారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు మాట్లాడుతూ 1948 డిసెంబరు 10వ తేదీన ఐక్యరాజ్యసమితి విశ్వ మానవ హక్కుల ప్రకటన చేసింది. మానవ హక్కులకు సంబంధించి హై కమిషనర్ అధికార సంస్థగా వ్యవహరిస్తుందని తెలిపారు. గీతామయి వృద్ధుల ఆశ్రమం అధినేత తమ్మినేని పాండు, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, గౌరవాధ్యక్షులు వై.చంద్రశేఖర్‌రెడ్డి, కె.భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ అధికారంలోకి వస్తే దుల్హన్‌కి లక్ష



**నెల్లూరు డిసెంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం** రాబోయే ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీల సోదరీమణుల పెళ్ళిళ్ళకు దుల్హన్ పథకం ద్వారా లక్ష రూపాయలు అందిస్తానని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని తెలుగుదేశం పార్టీ మైనార్టీ నగర నియోజకవర్గ అధ్య క్షుడు సాభిర్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని తెలుగుదేశం పార్టీజిల్లా కేంద్ర కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాభిర్ మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ముస్లిం మహిళలకు దుల్హన్ పథకం కింద రూ.50వేల నుంచి లక్ష అందిస్తానని హామీ ఇచ్చి మూడున్నర ఏళ్ళు గడచినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. గడచిన మూడున్నర సంవత్సరాల్లో షాదికా తోఫా పేరుతో షరతులతో కూడిన దుల్హన్ పదకాన్ని ప్రవేశపెట్టడం అనేక ముస్లిం సంఘాలు కోర్టుకు పోవడం జరిగిందన్నారు. అయినా దుల్హన్ పథకం అందడం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే దుల్హన్ పథకం ఇస్తానన్న హామీని చూసి యావత్తు మైనార్టీ ప్రజానీకం టీడీపీకి అండగా నిలబడటానికి సిద్ధమైందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తారని సాభిర్ వెల్లడించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి మైనార్టీ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## ఆశా కార్యకర్త ఉద్యోగానికి దరఖాస్తులు

కొండాపురం, డిశెంబర్10, ప్రభాతవార్త; కొండాపురం మండలంలోని శెట్టిపాళెం ఆశావర్కర్ ఉద్యోగానికి ఆసక్తి కలవారు దరకాస్తు చేసుకోవాలని కొండాపురం ప్రాథమిక వైద్యశాల అధికారి డాక్టర్ వినీత ఓ ప్రకటనలో తెలిపారు.కొండాపురం ప్రాథమిక వైద్య కేంద్రంపరిదిలోని శెట్టిపాళెం ఆశావర్కర్‌గా పనిచేయాల్సి ఉంటుందన్నారు.అర్హులైన మహిళా అబ్యర్దులనుండి దరకాస్తు కోరడమైందన్నారు.స్తానిక మహిళై ఉండాలని 25,45 వయస్సు మద్యలో ఉండాలని 10వ తరగతి పాసై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరకాస్తులు 11వతేదీన సాయంత్రం 4గంటల లోగా కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు.

## పారిశుధ్యం మెరుగునకై చర్యలు



**వింజమూరు,డిసెంబర్10ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని సూర్య డీలక్స్,ఆర్టీసి బస్టాండ్ సమీపంలో కాలువలో మురుగునీరు నిండి రోడ్డుపైకి ప్రవహిస్తుండడంతో శనివారం వింజమూరు ఎంపిడిఒ ప్రసన్నకుమారి , కార్యదర్శి ఉగ్గ శీనయ్యలు యుద్ధ ప్రాతిపధికన మిని జెసిబి సాయంతో కలువ పూడికతీత పనులు చేపట్టారు. ఈసందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అపరిశుభ్రత ఏర్పడకుండా ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేదుకు ముందస్తు చర్యల్లో భాగంగా పారిశ్యు పనులు చేయిస్తున్నా మన్నారు. వింజమూరులోని దుకాణాదారులు, నివాసాలుండేవారు కాలువలపై ఆక్రమణలు చేపట్టడంతో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రతి ఒక్కరూ మురుగునీరు వెళ్ళేందుకు వీలుగా కాలువలపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కూల్‌డ్రింక్ షాపు ఎదుట వ్యక్తి మృతి



**వింజమూరు,డిసెంబర్9ప్రభాతవార్త:** వింజమూరు పట్టణంలోని దేవతామహల్ సెంటర్‌లో మూసిఉన్న కూల్‌డ్రింక్‌షాపు ముందు నల్లగొండ్లకు చెందిన తాలూరి నాగరాజు (40) శుక్రవారం రాత్రి మృతి చెంది ఉన్నాడు. శనివారం ఉదయం కూల్‌డ్రింక్ షాపు ఎదుట వ్యక్తి మృతి చెంది ఉన్న విషయాన్ని పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జంపానికుమార్ సంఘటనా స్థలానికి వెళ్ళిమృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య , ముగ్గురు పిల్లలు ఉన్నారు . మృతికి గల కారణాలు తెలియరాలేదు.

## మండూస్ తుఫాన్ ప్రభావంతో జోరు వర్షం



**వింజమూరు, డిసెంబర్10 ప్రభాతవార్త:** మండూస్ తుఫాన్ ప్రభావతంతో వింజమూరులో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం వలన రోడ్లన్నీ నిర్మానుష్యంగా కన్పిస్తున్నాయి. వర్షంతోపాటు చలిగాలికూడా తోడు కావడంతో ఎక్కువమంది ఇళ్ళకే పరిమితమయ్యారు. రోడ్లన్నీ బోసుపోయాయి. పట్టణంలోని అనేకదు కాణాలు మూత పడ్డాయి. చలిగాలులు ఎక్కువగా వీస్తుండడంతో చలితీవ్రత పెరిగిచంటిపిల్లలు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. ఈ వర్షంతో మినుము పంట దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప, శనగ పంటలకు ఈ వర్షం ప్రయోజనం కలుగుతుందని రైతులు తెలిపారు.

## సిఐటియు 11వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ఆత్మకూరు,డిసెంబర్10ప్రభాతవార్త:**ఆత్మకూరు పట్టణంలో ఆదివారం 2గంటలకు సిఐటియు 11వ నెల్లూరు జిల్లా మహాసభలు జరుగుతాయని ఈ మహాసభలకు మర్రిపాడు మండలంలోని అన్ని ప్రజా సంఘాలైన అంగన్‌వాడీ, మిడ్డేమీల్స్, ఆశావర్కర్లు, ఎలక్ట్రిసిటీ, గ్రామ సేవలకు, భవన కార్మికులు, రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘాలు పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈసందర్భంగా దండు జాన్సన్ మాట్లాడుతూ సిఐటియు సభలో భవిష్యత్తులో జరగబోయే కార్యాచరణ కార్మిక హక్కుల సమస్యల కోసం ప్రణాళిక ఉంటుందని అన్ని ప్రజా సంఘాల కార్మికులు సూచనలు తీసుకొని భవిష్యత్తులో అన్ని రంగాల కార్మికులకు సంక్షేమం కోసం కృషిచేస్తారన్నారు. 11,12తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.


## శబరిమలకు తరలివెళుతున్న అయ్యప్పమాలదారులు

**మర్రిపాడు,డిసెంబర్10ప్రభాతవార్త:** మండలంలోని చుంచులూరుచెందిన అయ్యప్పమాలదారులు శనివారం శబరిమలకు తరలివెళ్ళారు. 41రోజులు నియమనిష్టలతో భక్తిశ్రద్ధలతో పూజలు, భజనలు నిర్వహించి ఇరుముడులు ధరించి అయ్యప్పదర్శనానికిబయలుదేరారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బంధుమిత్రులు గ్రామస్తులు అధికసంఖ్యలో హాజరై వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## జవహర్ భారతి కళాశాలలో హోరాహోరీగా రెజ్లింగ్ పోటీలు

**కావలి రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త** విక్రమ సింహపురి యూనివర్శిటీ అంతర్ కళాశాలల రెజ్లింగ్ పోటీలు శనివారం కావలి జవహర్ భారతి కళాశాల డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి మైదానంలో హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు జవహర్ భారతి కళాశాల ఆధిత్యం ఇవ్వడం జరిగింది. ఈ పోటీలను జవహర్ భారతి కళాశాల అధ్యాపకులు భాస్కర్‌రాజు ప్రారంభించారు. విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ సునీత, స్పోర్ట్స్ ప్రతినిధి ప్రేమ్ పర్యవేక్షణ చేశారు. విశ్వవిద్యాలయ అథ్లెటిక్ కార్యదర్శి డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్లు మణికంఠ, బ్రహ్మయ్య, బాబు. వాయిల శ్రీను, ప్రవీణ్, తిరుపాలు ప్రతినిధులుగా వ్యవహరించారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులు విశ్వవిద్యాలయ జట్టులో స్థానం కల్పించడం జరుగుతుంది.

## మాలకొండ ఆదాయం రూ.6.లక్షలు



**వలేటివారిపాలెం డిశంబరు 10, ప్రభాతవార్త** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించు కున్నారు. తద్వారా స్వామివారికి రూ.6,07,044ల మేర ఆదాయం సమకూరింది.ఆలయ ప్రధాన అర్చకులు గౌరీ భక్తులకు తీర్ధప్రసాదాలు అందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.2,500లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.19,920లు, వివాహాల నిర్వహణ వలన రూ.9,000లు,తలనీలాలు టిక్కెట్లు వలన రూ.30,175లు,వాహనపూజల వలన రూ. 820లు, ప్రత్యేకదర్శనం రూ.1,23,200లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ. 1260లు,రూముల అద్దెలు రూ.27,750 లు,క వర్లు అమ్మకం వలన రూ.3,900లు, అన్నదా నం నిమిత్తం రూ.2,11,434లు,లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.1,58,085లు విరాళాలు 19,000లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించారు. ఆలయ ఏసీ కె.బి శ్రీనివాసరావు భక్తుల ఏర్పాట్లును పర్య వేక్షించారు.మాలకొండ ప్రధమ చికిత్సా కేంద్రం మందులు కొనుగోలు నిమిత్తం తిమ్మారెడ్డిపాలెంకు చెందిన దాత పొలిమేర జయరామిరెడ్డి రూ.3వేలను ప్రకటించారు.

